## క్లుప్తంగా

### మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఐ.శారద సూచించారు. జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకుల టీచింగ్ నోట్స్, డైరీలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు భోజనం వడ్డించి నాణ్యతపై విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపునకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

### నిధుల మంజూరు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు ఎత్తిపోతల పథకం మరమ్మతులకు ప్రభుత్వం రూ.52 కోట్లు కేటాయించినట్టు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. తాళ్లూరులోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకాన్ని శుక్రవారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. రైతుల నించి వివరాలు తెలుసుకున్నారు. రైతులు, స్థానిక నేతలు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పుష్కర కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, మాజీ వైస్ ఎంపీపీలు పోతుల మోహన్‌రావు, మారిశెట్టి భద్రం, జెడ్ రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు పాల్గొన్నారు.

### వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 40 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

**అమ్మవార్లకు కుంకుమ పూజలు**

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో రుత్విక్కులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండ దిగువన కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకులు కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### నేడు మండల సమావేశం

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు శుక్రవారం తెలిపారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

### పాఠశాలకు ఫిక్స్‌డ్ డిపాజిట్ అందజేత

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థి పాటి రాజా రూ.5,116 ఫిక్స్‌డ్ డిపాజిట్ అందజేశారు. ఈ డిపాజిట్ పత్రాలను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.అబ్బులుకు ఆయన అందించారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పెదిరెడ్ల రాజు, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

### డ్వాక్రా మహిళలకు రుణాలు



జగ్గంపేటలో డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: నియోజకవర్గంలోని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాలకు చెందిన 77 డ్వాక్రా సంఘాలకు రూ.12.40 కోట్ల రుణాలను శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కు అందజేశారు. మండలంలోని కాట్రావులపల్లికి చెందిన మేరీ అనే మహిళలకు ఎగ్ కార్టు ద్వారా కోడి గుడ్లతో తయారు చేసిన ఉత్పత్తులు అమ్ముకునేందుకు అనుమతి ఇచ్చారు. త్వరలో కాట్రావులపల్లిలో ప్రత్యేక దుకాణం ప్రారంభిస్తామని వెలుగు ఏపీఎం ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, స్థానిక నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, అడపా భరత్, ఎంపీడీఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### బెల్లపు ఊట ధ్వంసం

తొండంగి: సారా తయారీకి సిద్ధం చేసిన 3700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తొండంగి ఇన్‌చార్జ్ హెచ్‌వో శివప్రసాద్ తెలిపారు. కాకినాడ జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారులు నవోదయం 2.0 భాగంగా జిల్లా ప్రోహిబిషన్ అధికారిణి కృష్ణకుమారి ఆధ్వర్యంలో తొండంగి మండలం బుచ్చియ్యపేట గ్రామంలో జాయింట్ దాడులు చేపట్టారు. సారా తయారీకి ఉపయోగించే సుమారు 3700 లీటర్లు బెల్లపు ఊట ధ్వంసం చేశారు. ఏడుగురు పాత ముద్దాయిలను తొండంగి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా ఇద్దరికి రూ.40 వేల జరిమానా విధించాచినట్టు శివప్రసాద్ తెలిపారు.

# గ్రోయిన్లకు గండ్లు.. రైతుకు కడగండ్లు

- శిథిలమైన తాండవ గ్రోయిన్లు
- రైతులకు తప్పని సాగునీటి ఇబ్బందులు
- 2 వేల ఎకరాల్లో పడని వరినాట్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తాండవ నదిలో కామినీడు గ్రోయిన్ నుంచి వృథాగా పోతున్న నీరు



కోటనందూరులో నాట్లు పడని తాండవ ఆయకట్టు భూమి

కోటనందూరు: పాలకుల అలసత్వం, అధికారుల ఉదాశీనత వెరసి తాండవ గ్రోయిన్ల కింద ఆయకట్టు రైతుల పాలిట శాపంగా మారింది. మెట్ట ప్రాంతమైన కోటనందూరు, తుని మండలాల్లోని రైతులకు తాండవ నదిలో వృథాగా పోయే నీటిని మళ్లించి సాగునీరుగా అందించేందుకు తాండవ నదిలో గోయిన్లు నిర్మించారు. ప్రస్తుతం ఈ గ్రోయిన్లు శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతున్నాయి. శాశ్వత పరిష్కారం చూపుతామని పాలకులు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ గ్రోయిన్ల కింద వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గత వేసవిలో తాత్కాలిక మరమ్మతులు చేసిన గ్రోయిన్లు ఇటీవల కురిసిన వర్షాలతో వచ్చిన వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. దీంతో తాండవ నదిలో నీరు వృథాగా పోతోంది. కాలువల్లో నీరు ప్రవహించక, పాలాలకు నీరు చేరక ఆయకట్టు రైతులు సాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. భారీ వర్షాలు కురిసినా తమ పొలాల్లో నాట్లు వేయలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు గ్రోయిన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

**30 వేల ఎకరాల ఆయకట్టు**

తాండవ జలాశయం పరిధిలో తుని నియోజకవర్గంలో 30 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో 18 వేల ఎకరాల ఆయకట్టుకు తాండవ జలాశయం నుంచి కోటనందూరు, భీమవరపుకోట, ఇందుగపల్లి మేజర్ కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. మిగిలిన 12 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ఆరు దశాబ్దాల క్రితం తాండవ నదిపై అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో నిమ్మకట్టుతో పాటు మండలంలో అల్లిపూడి, కొట్టాం, కోటనందూరు, కామినీడు, దిగువాయి గ్రోయిన్లు నిర్మించారు. రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రోయిన్ల పరిసర ప్రాంతంలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరుగుతుండడంతో గోయిన్లు శిథిలమైపోయాయి. గత 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతూ వస్తోంది. ఈ దుస్థితితో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా రైతులు సాగునీటి కోసం అష్టకష్టాలు పడక తప్పడం లేదు. నదిలో నీటిని గ్రోయిన్ల ద్వారా పొలాలకు మళ్లించకపోతే పంటలు ఎండిపోతాయి.

**అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్లు**

శిథిలమైపోతున్న గ్రోయిన్లను నిర్మించేందుకు అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. కంటి తుడుపు చర్యగా నాశిరకం మెటీరియల్‌తో లోపభూయిష్టంగా చేసిన పనులు స్వల్ప వ్యవధిలోనే నదిలో కొట్టుకుపోతున్నాయి. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులు గోల చేయడం, అధికారులు ప్రణాళికలు తయారు చేయడం, ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పరిపాటిగా మారింది. ఇప్పటికీ ఏటా ఖరీఫ్‌కు ముందు అన్నదాతలు గ్రోయిన్ల దగ్గర ఇసుక బస్తాలు వేసుకొని సాగు నీటిని మళ్లించుకునే దయనీయ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

**నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి**



తాండవ నదిలో అడ్డగోలుగా జరుపుతున్న ఇసుక తవ్వకాల కారణంగా రూ.కోట్లతో నిర్మించిన గ్రోయిన్లు శిథిలమయ్యాయి. గ్రోయిన్లు సక్రమంగా లేక ఏటా సాగునీటి కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరిపంటకు నీరందక ఎండిపోయే పరిస్థితులు ఏటా దాపురిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన ఇరిగేషన్ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. గ్రోయిన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

రామసూరి సత్యనారాయణ, రైతు, బొద్దవరం

**నాట్లు వేయలేదు**



నేడు మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. గ్రోయిన్ల కింద కాలువలో నీరు పారక పొలానికి నీరంద లేదు. భారీగా వర్షాలు కురుస్తున్నా నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. తాండవ నదిలో నీరు వృథాగా పోతోంది. గ్రోయిన్లు బాగు చేసి మా పొలాలకు నీరందించాలి.

గొంప దేవుళ్లు, కౌలురైతు, కోటనందూరు

### బాధితులకు ఆర్థిక సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న మురళీ కృష్ణంరాజు

అన్నవరం: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గుల్లా ఆనంద్ భార్య కరుణ, పేద మహిళ చల్లా కాంతం అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు శుక్రవారం బాధితులను పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల సతీష్, గ్రామ ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్న, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, కొండి సతీష్, బలువు హరిబాబు, పలివెల కొండలరావు, గంపల జయరాజు, పెద్దింటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పైడిమల్లమ్మ తీర్థం

ఏలేశ్వరం: పట్టణంలో పైడిమల్లమ్మ తీర్థ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పెద్దవీధిలోని అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నిప్పుల గుండాన్ని పూజారి తొక్కారు. స్థానిక దిబ్బలపాలెం నుంచి పూజారిని శక్తివేషాలు, తీన్‌మార్, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. నిప్పుల గుండం చూసేందుకు మహిళలు పోటీ పడ్డారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పూజారి తోడుక్కుని ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

# కూటమి తీరుతో రైతులకు కష్టాలు



జగ్గంపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం

జగ్గంపేట: కూటమి ప్రభుత్వం రైతులకు యూరియా అందుబాటులో లేకుండా చేసిందని, యూరియా కోసం అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. వర్షాలు లేక ఇప్పటికే ఖరీఫ్ పనులు ఆలస్యం కావడంతో రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు పడినా వరిసాగుకు యూరియా కొరత అడ్డంకి మారిందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉండేదన్నారు. మాజీ సీఎం జగన్ రైతులకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు అందించే పెట్టుబడి సాయం రూ.40 వేలు ఇవ్వవలసి ఉండగా కేవలం రూ.5 వేల ఇచ్చారని తెలిపారు. మిగిలిన సొమ్ము ఎప్పుడు ఇస్తారో తెలియదన్నారు. అర్హులైన వికలాంగులకు పింఛన్లు తొలగించడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. రాజపాలెం- రామవరం రోడ్డు నిర్మాణంపై తాను చేసిన వ్యాఖ్యలకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వక్రభాష్యం చెబుతున్నారని విమర్శించారు. మెట్ట ప్రాంత రైతులకు ఎంతో అవసరమైన తాళ్లూరు ఎత్తిపోతల పథకం మరమ్మతులకు ప్రభుత్వం రూ. 52 కోట్లు మంజూరు చేయడంపై తోట నరసింహం హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ, జిల్లా, నియోజకవర్గస్థాయి నేతలు కరుటూరి శ్రీనివాస్, రామకుర్తి మూర్తి, పెద్దాడ రాజబాబు, తులా రాము, తోట అయ్యన్న, ఒబిణ్ణి వీరబాబు, కరుటూరి వీర్రాజు, రావుల గణేష్ రాజా, శకరణం అచ్చిరాజు, కాపారపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడతామని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తెలిపారు. కిర్లంపూడిలోని పార్టీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో గిరిబాబు అధ్యక్షతన మండల కన్వీనర్లు, నియోజకవర్గ అనుబంధ కమిటీ విభాగాల సభ్యులతో శుక్రవారం విస్తృత సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపట్టే కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై గిరిబాబు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిందన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చకుండా ముఖం చాటేస్తున్న తీరును ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో వివిధ విభాగాల్లో పదవులు ఇచ్చారన్నారు. సామాజిక వర్గాల ప్రకారం గ్రామాల్లో ఉత్సాహంగా పనిచేసే కార్యకర్తల జాబితాను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు దివాణం, శిడగం వెంకటేశ్వరరావు, నరాల శ్రీను, రామిశెట్టి నాని, గుడాల వెంకట రత్నం, సరమర్ల మధుబాబు, గొల్లు వెంకటరమణ, సకురు గుర్రాజు, నడిగట్ల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

### లాయర్ల అసోసియేషన్ రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ




తునిలో రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న లాయర్లు

తుని: గుంటూరులో ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించే లాయర్ల అసోసియేషన్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రగడ చక్రరావు పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రం, పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చక్రరావు మాట్లాడుతూ న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేటా చర్యలు తీసుకోవాలని కోరారు. లాయర్లు అందరూ ఈ సదస్సుకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లాయర్లు మాకినీడు బాబు, జల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్లకు బియ్యం బస్తాల పంపిణీ

జగ్గంపేట: నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఆటో డ్రైవర్లకు జ్యోతుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. స్థానిక కాపు కల్యాణ మండపం వద్ద మొత్తం 1740 మందికి ఒక్కొక్కరికి 25 కేజీల చొప్పున బియ్యం బస్తాలు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ అందజేశారు. ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు పథకం అమలు చేయడం వలన ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు బియ్యం పంపిణీ చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

# జీడిపప్పు పరిశ్రమలో పనులు కల్పించాలి



జీడిపప్పు పరిశ్రమ యాజమాన్యంతో సమస్యలపై చర్చిస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

తుని రూరల్: జీడిపప్పు పరిశ్రమలో వారం రోజులు పనిదినాలు కల్పించి, పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం తుని మండలం హంసవరం శివారు జీడిపప్పు పరిశ్రమ వద్ద సీఐటీయూ నాయకులతో కలసి కార్మికులు ఆందోళన చేశారు. ఆందోళన చేస్తున్న మహిళా కార్మికులకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు నక్కెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ 20 ఏళ్లగా పని చేస్తున్న కార్మికులకు లే ఆఫ్ అమలు చేస్తుండడంతో మిగిలిన రోజులు ఎక్కడికి పనులకు వెళ్లాలో తెలియక కార్మికులు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారన్నారు. 20 ఏళ్ల నుంచి పీఎఫ్ కట్ చేస్తున్నా రికార్డుల్లో తప్పులు వల్ల ఆ మొత్తాలను తీసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. వారం రోజులు పని కల్పించాలని, పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రమణమ్మ, నాగమణి, అమ్మాజీ, వెంకటలక్ష్మి, సీత తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో దివ్యాంగులకు అన్యాయం



ఆరుగుల మోషే

కోటనందూరు: ప్రభుత్వం రీ సర్వే పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించి, వారికి అన్యాయం చేస్తోందని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే మండిపడ్డారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అనర్హుల పింఛన్లు తొలగించాలి కాని కళ్లు, కాళ్లు లేని వారి పింఛన్లు నిలిపివేయడం అత్యంత బాధాకరమన్నారు. మండలంలో వందల సంఖ్యలో పింఛన్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరం వ్యవస్థను అడ్డంపెట్టుకొని ప్రభుత్వం అర్హులకు అన్యాయం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. రీ సర్వే సమగ్రంగా నిర్వహించి అర్హులైన వారికి పింఛన్లు అందించాలని, లేని పక్షంలో మాదిగ రక్షణపోరాట సమితి ద్వారా దివ్యాంగుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. పలువురు ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ అప్పారావు

ఏలేశ్వరం: విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలని ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ బల్ల అప్పారావు సూచించారు. పట్టణంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. సునీత అధ్యక్షతన శుక్రవారం జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. స్థానిక లారీ యూనియన్ కార్యాలయంలో ప్రధానమంత్రి ఉచ్చాతర శిక్షా అభియాన్ పథకంలో భాగంగా ఎంట్రీవిస్టా అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులు ఉద్యోగాలు అడిగే స్థాయిలో కాకుండా ఇప్పించే స్థాయిలో ఉండాలనే ఉద్దేశంతో ఈ వర్క్‌షాపు నిర్వహించినట్టు తెలిపారు. విద్యార్థులు స్కిల్ డెవలప్‌మెంట్‌పై పట్టు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ఆచార్యులు వైవీవీ ఎస్ఎస్ఎస్ వరప్రసాద్, అనిరుధ్ సిట్లా, జగ్గంపేట ప్రిన్సిపాల్ చిన్నారావు, డాక్టర్ జె.సురేష్, ఆర్గనైజింగ్ కన్వీనర్ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### జోరుగా సేవా కార్యక్రమాలు

ఏలేశ్వరం: పద్మ విభూషణ్, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసపత్రిలో రోగులకు వైద్యాధికారి శైలజ చేతుల మీదుగా రొట్టెలు, పాలు, పండ్లు పంపిణీ చేశారు. చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ ద్వారా వందలాది మందికి ప్రాణదానం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో అభిమానులు సేవాకార్యక్రమాలు చేయాలన్నారు. తొలుత ఆసుపత్రి ఆవరణలో మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భవిత కేంద్రంలో దివ్యాంగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముచ్చర్ల రమేష్, సిరిపరపు రాజేష్, మామిడి శ్రీను, బిగ్‌బాస్, లోగిసు శేఖర్, ధనబాబు, మసిరపు నాగేశ్వరరావు, అనంతారపు రాజు, యండగండి నాగబాబు, దత్తిరాజా, ఆతం అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# వరలక్ష్మీ నమోస్తుతే..

- భక్తిశ్రద్ధలతో చివరి శ్రావణ శుక్రవార పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



కాట్రావులపల్లిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



తంటికొండ వెంకన్న ఆలయంలో వరలక్ష్మీ పూజలు

ఏలేశ్వరం: శ్రావణమాసంలో చివరి శుక్రవారాన్ని పుస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల వద్ద మహిళలు భక్తిగీతాలు ఆలపించారు. పలువురు మహిళలు ఉదయం ఇళ్ల వద్ద వరలక్ష్మీ పూజలు చేశారు. సాయంత్రం ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, తోట వీధి, మార్కెట్ వీధి, దిబ్బలపాలెం తదితర ఆలయాల వద్ద రద్దీ నెలకొంది. కొత్తయర్రవరంలోని ధనలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద విశ్వ హిందూ పరిషత్ అనుబంధ దుర్గావాహిణి, మాతృశక్తి సంఘాల ఆధ్వర్యంలో పలు పారాయణాలు పఠించారు. కార్యక్రమంలో పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరీటి, గిరిజ, ఇందిరా, మంగామణి, సుభాషిణి, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: శ్రావణ మాసంలో చివరి శుక్రవారం సందర్భంగా మండలంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తాళ్లూరు దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు.

తుని రూరల్: మండలంలో పలు ఆలయాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. శ్రావణ మాసంలో ఆఖరి శుక్రవారం కావడంతో కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు సామూహిక వ్రతాలు చేశారు.వేదపండితులు అమ్మవారికి చండీ హోమం, ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, వ్రతాలు నిర్వహించారు. పూజా సామగ్రిని దేవస్థానం ఉచితంగా సమకూర్చింది. భక్తులకు వేదాశీర్వచనం, అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలను అందించారు. గెడ్డబీడు సమీపంలో గల ధారాలమ్మ తల్లి ఆలయంలోనూ మహిళలు సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఎస్.అన్నవరం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. వందలాది మంది మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతాలు ఆచరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**వరమహాలక్ష్మికి పుష్పాలంకరణ**

తుని: స్థానిక చిట్టూరి మెట్రోలో వేంచేసిన వరమహాలక్ష్మీ అమ్మవారిని శ్రావణమాసంలో ఆఖరి శుక్రవారం సందర్భంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వేద పండితులు అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. 150 మంది శ్రీప్రకాష్ విద్యార్థులు భగవద్గీత పారాయణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

**అరుణాచలక్షేత్రంలో..**

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు అర్ధనారీశ్వరుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోకవరం: మండలంలోని తంటికొండ వెంకన్న దేవస్థానంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. పవిత్ర శ్రావణ మాసంలోని చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో సుమారు 500 మంది మహిళలు పాల్గొన్నారు. వీరికి దేవస్థానం తరపున చైర్మన్ బద్ది రెడ్డి అచ్చన్నదొర, సువర్ణతులసీ దంపతులు పూజాసామగ్రిని ఉచితంగా అందజేశారు. దేవస్థానం సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



రాచపల్లిలో అర్ధనారీశ్వరుడిగా అరుణాచలేశ్వరస్వామి